సాక్షి నిర్మల్

ఆదివారం । 10 । డిసెంబర్ । 2023



ఇక్కడ గెలిచే పార్టీకే అధికారం

ఖానాపూర్‌లో ఏ పార్టీ ఎమ్మెల్యే గెలిస్తే ఆ పార్టీ ప్రభుత్వమే రాష్ట్రంలో ఏర్పాటవుతుంది. గడిచిన మూడు ఎన్నికల్లో ఇదే రిపీట్ అవుతోంది.

8లో▸

వేధింపులా..! 'సాహస్'మే అస్త్రం


పని ప్రదేశాల్లో వేధింపులు, సమస్యలపై ఫిర్యాదు చేసేందుకు మహిళా భద్రతా విభాగం ఇటీవల 'సాహస్' పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది.

8లో▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 29.4 /16.1

వాతావరణం పొడిగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా తక్కువగా నమోదవుతాయి. రాత్రి మంచు అధికంగా కురుస్తుంది. చలి తీవ్రత పెరుగుతుంది.



మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు



బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్



చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్



ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు



ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి



బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

..అనే నేను

ఉమ్మడి ఆదిలాబాద్‌లో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్నికైన వారంతా ఎమ్మెల్యేలుగా శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. హైదరాబాద్‌లోని అసెంబ్లీలో ప్రొటెం స్పీకర్ అక్బరుద్దీన్ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు, బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్, చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ ప్రమాణ స్వీకారం చేశారు. నిర్మల్, ముథోల్, సిర్పూర్, ఆదిలాబాద్ నుంచి ఎమ్మెల్యేలుగా ఎన్నికైన ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, రామారావుపటేల్, పాల్వాయి హరీశ్‌బాబు, పాయల్ శంకర్ ప్రమాణ స్వీకారానికి దూరంగా ఉన్నారు.

న్యూస్‌రీల్

బీజేపీ ఎమ్మెల్యేలను సత్కరించిన కేంద్ర మంత్రి



అమరవీరుల స్థూపం వద్ద బీజేపీ ఎమ్మెల్యేలు

భైంసాటౌన్: జిల్లాకు చెందిన బీజేపీ ఎమ్మెల్యేలు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, పవార్ రామారావుపటేల్ శనివారం హైదరాబాద్‌కు తరలివెళ్లారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షులు కిషన్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా ఆయన ఎమ్మెల్యేలను సత్కరించారు. అనంతరం ఇతర బీజేపీ ఎమ్మెల్యేలతో కలిసి భాగ్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అలాగే ట్యాంక్‌బండ్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి, గన్‌పార్క్‌లోని తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించారు. అనంతరం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో పాల్గొన్నారు.

రెండు 'గ్యారంటీలు' ప్రారంభం

- ఉచిత బస్సుప్రయాణం
- రాజీవ్ ఆరోగ్యశ్రీ ప్రారంభించిన కలెక్టర్



ఆరోగ్యశ్రీ పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్

నిర్మల్: రాష్ట్రంలో కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆరుగ్యారంటీల అమలుపై దృష్టి పెట్టింది. ఇందులో భాగంగా మహిళలకు ఉచితంగా ఆర్టీసీబస్సుల్లో ప్రయాణం, రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా రూ.10 లక్షల వరకు వైద్య సదుపాయాలు అందించే పథకాలను ప్రారంభించింది. రాష్ట్రవ్యాప్తంగా శనివారం చేపట్టిన కార్యక్రమాన్ని జిల్లాలో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, అడిషనల్ కలెక్టర్ కిశోర్‌కుమార్, ఆర్టీసీ, వైద్య అధికారులతో కలిసి ప్రారంభించారు. బస్టాండ్‌లో మహిళల ఉచిత బస్సును, జిల్లా ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ పరిమితి పెంపును ప్రారంభించారు.

మహా సంబురం!



జీరో టికెట్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఆశిస్ సంగ్వాన్



ప్రయాణికులతో మాట్లాడుతున్న అధికారులు



మిఠాయిలు పంచుతున్న కాంగ్రెస్ నాయకులు



నిర్మల్ నుంచి ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న మహిళలు

- పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం
- నిర్మల్ డిపో పరిధిలో 14 వేలు, భైంసా డిపో పరిధిలో 7 వేల మందికి లబ్ధి
- సంతోషం వ్యక్తం చేస్తున్న మహిళా ప్రయాణికులు

భైంసాటౌన్/నిర్మల్: కాంగ్రెస్ ఆరు గ్యారంటీల అమలులో భాగంగా శనివారం రెండు హామీ లను ప్రభుత్వం అమలు చేసింది. ఆరోగ్యశ్రీ పరిమితి రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచారు. ఇక మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం ప్రారంభించారు. మధ్యాహ్నం 2 గంటలకు, నిర్మల్, భైంసా డిపోల పరిధిలోని బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణసేవలు ప్రారంభించారు. నిర్మల్‌లో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, భైంసా డిపో అసిస్టెంట్ మేనేజర్ శ్రీలత తోపాటు పలువురు కాంగ్రెస్ నాయకులు ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం మంచి నిర్ణయమని అన్నారు. వయసుతో సంబంధం లేకుండా మహిళలందరికీ వర్తింపజేయడంతో పేద, మధ్యతరగతి మహిళలు లబ్ధి పొందుతారని, ట్రాన్స్‌జెండర్లకు కూడా ఈ అవకాశం ఉందని తెలిపారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు మహిళా ప్రయాణికులకు మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సింధే ఆనంద్‌రావు, శంకర్‌చంద్రే, చందులాల్ తదితరులు పాల్గొన్నారు. ఆర్టీసీలో ఉచిత ప్రయాణంపై పలువురు మహిళా ప్రయాణికులు హర్షం వ్యక్తం చేయగా, మరికొందరు భిన్నంగా స్పందించారు.

103 బస్సులు..

నిర్మల్ డిపోలో మొత్తం 136 బస్సులున్నాయి. ఇందులో 69 అద్దె బస్సులు 67 సంస్థ బస్సులు వివిధ మార్గాల్లో ప్రయాణిస్తాయి. 55 మార్గాల్లో బస్సులు నడుస్తున్నాయి. ప్రస్తుతం నిర్మల్ డిపో పరిధిలో ఎక్స్‌ప్రెస్ 31, పల్లె వెలుగులు 72 ఉచితంగా మహిళలు ప్రయాణం చేసేందుకు ఏర్పాట్లు చేశారు.

త్వరలో స్మార్ట్ కార్డులు...

మహాలక్ష్మి పథకం కింద బస్సుల్లో ప్రయాణించే బాలికలు, మహిళలు, ట్రాన్స్ జెండర్లకు కండక్టర్లు జీరో టికెట్ జారీ చేస్తారు. కండక్టర్ల వద్ద ఉండే టిమ్ (టికెట్ ఇష్యూ మిషన్) ద్వారా ఈ టికెట్ జారీ అయ్యేలా సాఫ్ట్‌వేర్‌ను రెండు, మూడు రోజుల్లో అప్‌లోడ్ చేయనున్నారు. అప్పటి వరకు మహిళలకు ఎలాంటి టికెట్ జారీ చేయనుండానే ఉచితంగా తీసుకెళ్తారు. త్వరలోనే మహిళలకు మహాలక్ష్మి పేరిట స్మార్ట్‌కార్డులు ఇచ్చేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ కార్డులను కండక్టర్లకు చూపించి జీరో వాల్యూ టికెట్ తీసుకోవచ్చు.

మహిళలందరికీ ఉచితమే..

రాష్ట్రంలో గృహిణులు, యువతులు, బాలికలు, మహిళా ఉద్యోగులు ఆర్టీసీ పల్లె వెలుగు, ఎక్స్ ప్రెస్ బస్సుల్లో ఎక్కడి నుంచి ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణించే వెసులుబాటును ప్రభుత్వం కల్పించింది. పాఠశాలలు, కళాశాల విద్యార్థులు, ప్రైవేటు, ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, అన్ని కేటగిరీల్లోని ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులు, కార్మికులు అన్నివర్గాల మహిళలు రోజువారీగా ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చు.

పేదలకు ప్రయోజనం..



ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం మంచి నిర్ణయమే. మాలాంటి పేదలకు ప్రయోజనకరంగా ఉంటుంది. పెరిగిన బస్సు చార్జీలతో పిల్లాపాపలతో కలిసి వెళ్లాలంటే భయపడ్డాం. ఇకపై ఆ బాధ లేదు. బస్సులు సరిపడా నడపాలి.

– ముత్తవ్వ, ప్రయాణికురాలు, బొప్పారం

పథకం బాగుంది..



ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం పథకం బాగుంది. పండుగలు, ఇతర సందర్భాల్లో ఇంటిల్లిపాది వెళ్లాలంటే బస్సు చార్జీలకే ఎక్కువ డబ్బులు అయ్యేది. ఇప్పుడు వయసుతో సంబంధం లేకుండా మహిళలందరికీ ఉచిత ప్రయాణం అంటున్నారు. మంచి నిర్ణయమే. – పోసాని, వాటోలి

కనీస చార్జి ఉండాలి..



నేను ఊళ్లకు తిరుగుతూ గాజులు అమ్ముతాను. ప్రతిరోజూ బస్‌లో వెళ్లి వస్తుంటాను. మహిళలకు ఉచిత ప్రయాణం మంచి నిర్ణయమే అయినా ఆర్టీసీపై భారం పడకుండా కనీస చార్జి వసూలు చేస్తే బాగుంటుంది.

– వెంకటమ్మ, నిర్మల్

రవాణా ఖర్చులు మిగులుతాయి



ఉచిత బస్సు ప్రయాణంతో రవాణా ఖర్చులు మిగులుతాయి. వైఎస్సార్ హయాంలో మహిళలకు డ్వాక్రా గ్రూపులు ఏర్పాటు చేసి పావలా వడ్డీకే రుణాలు ఇవ్వగా.. ఇప్పుడు రేవంత్ రెడ్డి ఉచిత బస్సు సౌకర్యం కల్పించడం సంతోషంగా ఉంది. – గంగు బాయి, లక్ష్మణచాంద

అన్ని బస్సుల్లో అవకాశం కల్పించాలి..



కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేసింది. పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ సర్వీసుల తోపాటు దూర ప్రాంతాలకు వెళ్లేందుకు సూపర్ లగ్జరీ, ఏసీ బస్సుల్లో కూడా ఉచితంగా ప్రయాణించే అవకాశం కల్పించాలి. టికెట్‌లేని ప్రయాణంతో పేద మహిళలకు రవాణా సమయంలో ఆర్థిక భారం తగ్గుతుంది. – రుచిత

ఆర్థికభారం తగ్గుతుంది..



ఆర్టీసీ బస్సుల్లో మహిళలు అధిక సంఖ్యలో ప్రయాణిస్తుంటారు. ఉచిత ప్రయాణం చేయడానికి అవకాశం ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు. దీంతో మధ్య తరగతి ప్రజలకు కొంతమేర ఆర్థికభారం తగ్గుతుంది. – లక్ష్మి

కాంగ్రెస్ చెప్పిందే చేస్తుంది..



కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందంటే కచ్చితంగా అమలు చేసి తీరుతుంది. తెలంగాణ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో ప్రధానమైనది మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం. తెలంగాణ ఇచ్చిన సోనియా గాంధీ జన్మదినం సందర్భంగా ప్రారంభించడం సంతోషంగా ఉంది. – భవాని, కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు

ఎలా గెలుస్తం!?

- రాష్ట్రంలో అధికారం..
- జిల్లాలో ఒక్కటే స్థానం..
- నిర్మల్, ముథోల్‌లో పట్టులేని పార్టీ
- రానున్న ఎన్నికల నేపథ్యంలో..
- కాంగ్రెస్ నేతల్లో అంతర్మథనం!
- గ్యారంటీలు, పథకాలపైనే ఆశలు

నిర్మల్: రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ హవా నడుస్తోంది. రాష్ట్రంలో ఏకంగా ప్రభుత్వాన్నే ఏర్పాటుచేసింది. కానీ.. జిల్లాకు వచ్చేసరికి పరిస్థితి విరుద్ధంగా ఉంది. ఇక్కడ మూడు నియోజకవర్గాలకుగానూ ఖానాపూర్‌లో మాత్రమే కాంగ్రెస్ జెండా ఎగరేసింది. నిర్మల్, ముథోల్ మాత్రం దారుణంగా మూడోస్థానానికి పడిపోయింది. సరే.. జిల్లాలో రాకున్నా రాష్ట్రంలోనైతే అధికారంలో ఉన్నాం కదా.. అని కార్యకర్తలు ఊరట చెందుతున్నారు. కానీ.. అసెంబ్లీతోనే ఎన్నికలు ఆగిపోలేదు. ఇక వరుసగా స్థానికసంస్థలు, లోక్‌సభ, మున్సిపల్ ఎన్నికలు ఉంటాయి. రాష్ట్రంలో అధికారంలో ఉన్నందున వీటిల్లో సత్తా చాటాల్సి ఉంటుంది. జిల్లా నాయకులు మాత్రం తమ పథకాలు, గ్యారంటీలు గెలిపిస్తాయని, పార్టీని పటిష్ఠం చేస్తామని చెబుతున్నారు.



ఇక్కడేమో ఉల్టా..

కొన్నినెలల వ్యవధిలోనే రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్‌కు మంచి ఊపు వచ్చింది. దాదాపు మెజార్టీ జిల్లాల్లో హస్తం గాలి బలంగా వీచింది. ఎన్నికల్లో కొన్ని జిల్లాల్లో ఒకటి రెండు స్థానాలు మినహా దాదాపు అన్ని స్థానాల్లో కాంగ్రెస్ గెలిచింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనూ తూర్పు ప్రాంతమంతా హస్తం హవానే కొనసాగింది. పశ్చిమ ప్రాంతానికి వచ్చేసరికి సీన్ మారిపోయింది. ఇక్కడ నిర్మల్, ముథోల్, ఆదిలాబాద్, సిర్పూర్ స్థానాలను బీజేపీ దక్కించుకోగా, బోథ్ బీఆర్‌ఎస్ గెలిచింది. ఇక పశ్చిమ ప్రాంతంలో కేవలం ఖానాపూర్ మాత్రమే కాంగ్రెస్‌కు ఊరటనిచ్చింది. ఈప్రాంతమంతా రాష్ట్రంలో ఉన్న పరిస్థితులకు విరుద్ధంగా బీజేపీకి జైకొట్టింది.

పట్టుతప్పింది..

ఒకప్పుడు జిల్లా కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా ఉండేది. ఈ పార్టీలోనే మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి ఎమ్మెల్యేలుగా గెలిచారు. పార్టీకి కూడా క్షేత్రస్థాయి నుంచి బలమైన కార్యకర్తలు, నాయకులు ఉండేవారు. 2014, 2018 వరుస ఎన్నికల్లో ఓడిపోయినా ప్రస్తుత నిర్మల్, ముథోల్ ఎమ్మెల్యేలు మహేశ్వర్‌రెడ్డి, రామారావుపటేల్ కాంగ్రెస్‌లోనే కొనసాగారు. ఏడాదిక్రితం వరకు పార్టీనే నమ్ముకున్నారు. కానీ.. అప్పుడున్న పరిస్థితుల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ డీలాపడటంతో వారు బీజేపీలో చేరారు. అక్కడి నుంచి హస్తం పార్టీ మరింత దయనీయ స్థితికి చేరింది. సీనియర్లంతా వారిద్దరు నేతలతో బీజేపీలోకి వెళ్లడంతో కాంగ్రెస్ పట్టుకోల్పోగా, కాషాయ పార్టీ బలపడింది. ఇదే విషయం ఇటీవల ఎన్నికల్లో స్పష్టంగా కనిపించింది. ఓవైపు ఆరుగ్యారంటీలు, ఎన్నో పథకాలు చెప్పినా ఓటర్లకు వాటిని చేర్చగలిగే క్షేత్రస్థాయి నాయకత్వం లేకపోవడం మైనస్‌గా మారింది.

రానున్న ఎన్నికల్లో ఎలా..

ఖానాపూర్‌లో ఎమ్మెల్యేగా వెడ్మ బొజ్జుపటేల్ గెలువడంతో అక్కడ పార్టీకి పెద్దగా ఇబ్బంది లేదు. కానీ.. నిర్మల్, ముథోల్ నియోజకవర్గాల్లోనే పార్టీని బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది. అసెంబ్లీ ఎన్నికలు పూర్తికావడంతో ఇప్పుడు పంచాయతీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, ఎంపీ, మున్సిపల్ ఎన్నికలపై పార్టీ దృష్టిపెట్టనుంది. ముందుగా ఒకట్రెండు నెలల్లోనే పంచాయతీ ఎన్నికలు రానున్నాయి. రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీ పల్లెల్లో గెలవాల్సిన అవసరం ఉంది. ఇక్కడా గెలవకపోతే.. పార్టీతోపాటు ప్రభుత్వంపైనా నమ్మకం సన్నగిల్లుతుంది.

ఏం చేయాలి...

ప్రజలు ఇచ్చిన ఆరు గ్యారంటీలతోపాటు పలు పథకాలను ప్రజల్లోకి ఎంతగా తీసుకెళ్తే.. అంతగా రానున్న ఎన్నికల్లో తమకు కలిసి వస్తుందని జిల్లా కాంగ్రెస్ నేతలు భావిస్తున్నారు. బీఆర్‌ఎస్ సర్కారు పాలనలో పల్లెలు ఎదుర్కొన్న సమస్యలపై ఫోకస్ చేయడంతోపాటు వాటిని తమ ప్రభుత్వం ఎలా పరిష్కరిస్తుందనే విషయాన్ని గ్రామీణుల దృష్టికి తీసుకెళ్తామని నాయకులు చెబుతున్నారు. పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేస్తామనిఅంటున్నారు.

పూర్వ వైభవం తెస్తాం.. గెలుస్తాం..

రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తమ పార్టీని పల్లె పోరులోనూ గెలిపిస్తాం. జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో క్షేత్రస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేస్తాం. ప్రతీ నాయకుడు, కార్యకర్త సైనికుడిలా పనిచేసి పూర్వవైభవం తీసుకువస్తాం. తమ ప్రభుత్వ గ్యారంటీలు, పథకాలతో ప్రజలే కాంగ్రెస్‌ను గెలిపిస్తాయి.

– కూచాడి శ్రీహరిరావు, డీసీసీ అధ్యక్షుడు

పుంజుకున్న 'కమలం'

- అసెంబ్లీ ఎన్నికల్లో సత్తా చాటిన బీజేపీ
- 'ఆదిలాబాద్ పార్లమెంట్' పరిధిలో కాషాయ పార్టీ హవా
- ఏడు అసెంబ్లీ స్థానాల్లో నాలుగు కైవసం

సాక్షి,ఆదిలాబాద్: ఈ శాసనసభ ఎన్నికల్లో ఆదిలాబాద్ పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలో కాషాయ పార్టీ ప్రభావం చూపింది. మొత్తం ఏడు నియోజకవర్గాలు ఉండగా, అందులో బీజేపీ నాలుగు, బీఆర్‌ఎస్ రెండు, కాంగ్రెస్ ఒకటి గెలుచుకున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో తొలిసారి ఆదిలాబాద్, నిర్మల్, ముథోల్, సిర్పూర్ నియోజకవర్గాల్లో కమలం పార్టీ బోణీ కొట్టింది. 2019లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ మొదటిసారి ఆదిలాబాద్ లోకసభ స్థానాన్ని గెలిచింది. తాజాగా శాసనసభ ఎన్నికల్లో ఏకంగా నాలుగు స్థానాల్లో ప్రభంజనం సృష్టించడం ఈ పార్లమెంట్ పరిధిలో సంచలనం కలిగిస్తుంది. మరికొద్ది నెలల్లో లోక్‌సభ ఎన్నికలు జరగనుండగా ఈ ఫలితాలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

2019తో పోలిస్తే..

సిర్పూర్‌లో బీజేపీకి ఓట్ల శాతం భారీగా పెరిగింది. ఆసిఫాబాద్‌లో గత పార్లమెంట్ ఎన్నికలతో పోలిస్తే ఈ శాసనసభ ఎన్నికల్లో కమలం పార్టీకి భారీగా ఓట్లు తగ్గాయి. ఎంపీ ఎన్నికల నాటి ప్రభావం ఇక్కడ కనిపించలేదు. ఖానాపూర్‌లో బీజేపీకి ఓట్లు స్వల్పంగా పెరిగినప్పటికీ విజయాన్ని అందుకోలేకపోయింది. ఆదిలాబాద్‌లో గతం కంటే ఓట్లు పెరిగాయి. ఈ పెరిగిన ఓట్లే బీజేపీ అభ్యర్థి గెలుపునకు దోహదపడ్డాయి. బోథ్‌లో బీజేపీకి గత పార్లమెంట్ ఎన్నికల్లో ఈ నియోజకవర్గంలో పోలైన ఓట్లకంటే శాసనసభ ఎన్నికల్లో తగ్గాయి. ఇక్కడ బీఆర్‌ఎస్ అభ్యర్థికి లభించిన మెజార్టీతో పోలిస్తే తగ్గిన ఓట్లు ప్రభావం చూపడం లేదు. నిర్మల్, ముథోల్‌లో బీజేపీకి భారీగా ఓట్ల శాతం పెరిగింది. ఇది రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఈ నియోజకవర్గాల్లో బీజేపీకి సానుకూల అంశం.

2019తో పోలిస్తే 2023లో బీజేపీకి ఓట్ల హెచ్చుతగ్గులు..

నియోజకవర్గం	బీజేపీ-2023	బీజేపీ-2019	బీఆర్‌ఎస్-2023	బీఆర్‌ఎస్-2019	కాంగ్రెస్ -2023	కాంగ్రెస్ -2019	+/-
సిర్పూర్	63,702	24,047	60,614	60,740	8,427	47,355	+39,655
ఆసిఫాబాద్	6,609	44,874	83,036	47,401	60,238	43,793	-38,265
ఖానాపూర్	52,398	47,320	54,168	30,481	58,870	60,748	+5,078
ఆదిలాబాద్	67,608	63,169	60,916	47,594	47,724	37,803	+4439
బోథ్	53,992	61,094	76,792	42,850	32,797	36,392	-7,102
నిర్మల్	1,06,400	61,172	55,697	45,387	28,642	46,617	+45,228
ముథోల్	98,252	75,216	74,253	44,212	15,588	41,349	+23,036
మొత్తం	4,48,961	3,76,892	4,65,476	3,18,665	2,52,286	3,14,057	+72,069

ప్రజాస్వామ్యంలో ప్రజలే దేవుళ్లు

- ఓటర్ల తీర్పును అంచనా వేయలేకపోయాం
- మాజీమంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

నిర్మల్: 'ప్రజాస్వామ్యంలో ప్రజలే దేవుళ్లు. ఎన్నికల్లో వారిచ్చిన తీర్పును శిరసావహిస్తా.' అని మాజీమంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలోని తన నివాసంలో శనివారం మాట్లాడారు. చివరి వరకూ ప్రజల మనోభావాల ను ఊహించలేకపోయామని, కౌంటింగ్ రోజు సారంగపూర్ ఒక్క మండలంలోనే 13 వేల ఓట్లు తమకు తక్కువ రావడంతో ప్రజల తీర్పు భిన్నంగా ఉందని గ్రహించామన్నారు. ప్రజలు ఇచ్చిన తీర్పును స్వీకరిస్తున్నామన్నారు. ఇకపై ప్రతిపక్షంగా కొత్త జీవితాన్ని ప్రారంభిస్తామన్నారు. ప్రజలు, కార్యకర్తల మధ్యనే ఉంటానని, కార్యకర్తలను కాపాడుకుంటానని చెప్పారు. సర్పంచ్, స్థానిక సంస్థల, ఎంపీ, మున్సిపల్ ఎన్నికల్లో గెలుస్తామని ధీమా వ్యక్తంచేశారు. కాంగ్రెస్, బీజేపీలు ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలన్నారు. తాను జిల్లా పరిషత్ ఎన్నికలప్పటి నుంచి ఎన్నో ఒడిదుడుకులను చూస్తున్నానని చెప్పారు. 2009 ఎన్నికల్లోనూ ఇలాంటి పరిస్థితులను చూశామన్నారు. తమ పార్టీ కార్యకర్తలు, నాయకులపై కేసులు పెడతామని బెదిరిస్తున్నారని, ఎన్నికల సమయంలో జరిగిన వాటిపై ప్రతీకార చర్యలు చేపట్టడం సరికాదన్నారు. నిర్మల్ మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు కాంగ్రెస్‌లోకి వెళ్తున్నారనే ప్రచారం సరికాదన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు డాక్టర్ సుభాష్‌రావు, జెడ్పీటీసీ జీవన్‌రెడ్డి, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆర్థికసాయం అందజేత



సాయం అందిస్తున్న మిత్రులు

ఖానాపూర్: దస్తూరాబాద్ మండల కేంద్రానికి చెందిన బాలుడు నాగచైతన్య విద్యుత్‌షాక్‌కు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. ఈ విషయమై ఈ నెల 7న ‘నా కొడుకును కాపాడండి’ శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి దాతలు స్పందిస్తున్నారు. శనివారం ఖానాపూర్ పట్టణానికి చెందిన మాజీ మంత్రి ఐకేరెడ్డి పీఏ కృష్ణంరాజు రూ.5వేల ఆర్థికసాయాన్ని తన మిత్ర బృందం ద్వారా బాధిత కుటుంబానికి అందజేశారు. ఖానాపూర్ పట్టణంలోని విద్యానగర్‌లోని బాలుడి మామయ్య శేఖర్‌కు నగదును అందజేశారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఖర్చులో సైతం డిస్కౌంట్ ఇప్పించేందుకు ఆస్పత్రి యాజమాన్యంతో మాట్లాడినట్లు తెలిపారు.

నిరుపేద విద్యార్థులకు ఉపకార వేతనాలు



మాట్లాడుతున్న డైరెక్టర్ బిలాల్

ఎదులాపురం: నీట్, ఐఐటీ, సీఏ ఫౌండేషన్, ఎన్‌డీఏ వంటి ఉన్నత విద్య అభ్యసించాలనుకునే నిరుపేద విద్యార్థుల కోసం ఉపకార వేతనాలను అందిస్తున్నట్లు ఎంఎఫ్ఈఆర్‌డీ డైరెక్టర్ బిలాల్ తెలియజేశారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఈనెల 24వ తేదీన ఉపకార వేతన అర్హత పరీక్ష నిర్వహించడం జరుగుతోందని వెల్లడించారు. అర్హత కలిగిన విద్యార్థులు ఈ నెల 21వ తేదీ లోగా www.mferd.org వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. అర్హత పరీక్షలో ప్రతిభ కనబరిచిన వారికి ఉపకార వేతనాన్ని అందజేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వి నియోగం చేసుకోవాలని సూచించారు.

పురుగుల మందు తాగి యువకుడు మృతి

ఆసిఫాబాద్‌రూరల్: మద్యం మత్తులో పురుగుల మందు తాగి యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని సాలెగూడలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన చాపిడి రావుజీ, ప్రవీణ దంపతుల కుమారుడు చాపిడి శంకర్ (24) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. శుక్రవారం రాత్రి మద్యం మత్తులో ఇంట్లో ఉన్న పత్తి మందు తాగాడు. కుటుంబ సభ్యులు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై రాజేశ్వర్ తెలిపారు.

వేధింపులా..! సాహసమే అస్త్రం

- మహిళల భద్రతపై ప్రత్యేక పోర్టల్
- సమస్యలు చెప్పుకునేందుకు ‘గెట్ హెల్ప్’ ఆప్షన్



పవర్ ప్లాంటులో కార్మికులతో మాట్లాడుతున్న ఫిర్యాదుల కమిటీ చైర్మన్ ఆశ

సాక్షి, మంచిర్యాలడెస్క్: పని ప్రదేశాల్లో మహిళా ఉద్యోగులు లైంగిక వేధింపులు, ఇతర సమస్యలూ ఎదుర్కొంటున్నారు. కొందరు ధైర్యంగా ఫిర్యాదు చేయడమో.. ఎదిరించడమో చేస్తుండగా మరికొందరు మౌనంగా భరిస్తూ మానసికంగా కుమిలిపోతున్నారు. తాజాగా మంచిర్యాల జిల్లా అటవీశాఖలో మహిళా బీట్ ఆఫీసర్ ఉన్నతాధికారుల వేధింపులు తాళలేక ఆత్మహత్యాయత్నం చేసింది. పని ప్రదేశాల్లో వేధింపులు, సమస్యలపై ఫిర్యాదు చేసేందుకు మహిళా భద్రతా విభాగం ఇటీవల ‘సాహస్’ పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. పని ప్రదేశంలో మహిళా ఉద్యోగుల భద్రతకు తీసుకోవాల్సిన చర్యలు, లైంగిక వేధింపులపై ఎలా ఫిర్యాదు చేయాలి, న్యాయ సహాయం ఎలా పొందాలి అనే వివరాలు పొందుపర్చారు. సోమవారం నుంచి శుక్రవారం వరకు ఉదయం 10.30గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు 7331194540 నంబరులో ఫిర్యాదు చేయవచ్చని అధికారులు సూచిస్తున్నారు. ప్రభుత్వ సెలవు రోజుల్లో మినహా మిగతా రోజుల్లో సహాయం అందిస్తారు. ఫోన్ ద్వారా గానీ వాట్సాప్ ద్వారా గానీ సంప్రదించవచ్చు.

‘గెట్ హెల్ప్’

పోర్టల్‌లో గెట్ హెల్ప్ ఆప్షన్ ద్వారా బాధితులు గానీ వారి సంబంధీకులు గానీ సలహాలు, సూచనలు పొందవచ్చు. సమస్యను తెలియజేస్తే సంబంధిత ప్రముఖ నిపుణులు ఆయా సమస్యలు, ఇబ్బందులపై ఎలా ముందుకెళ్లాలనే అంశంపై వివరిస్తారు. వ్యక్తిగతంగా గానీ సంస్థల పరంగా గానీ ఎదురవుతున్న ఇబ్బందులను వివరిస్తే సవివరమైన సమాధానం లభిస్తుంది. న్యాయ, చట్టపరంగా ఉన్న అన్ని సానుకూల అంశాలను తెలియజేస్తారు. భద్రత దృష్ట్యా ఫిర్యాదుదారు, సంప్రదించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతారు.

యాజమాన్యం దృష్టికి తేవాలి

జైపూర్: మండల కేంద్రంలోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటులో ఉన్న ఆయా ప్రాంతాల్లో పని చేస్తున్న మహిళా కార్మికులు లైంగిక వేధింపులకు గురైన యాజమాన్యం దృష్టికి తీసుకు రావాలని లైంగిక వేధింపుల నివారణ, ఫిర్యాదుల కమిటీ ఎస్టీపీపీ చైర్‌పర్సన్ ఆశ తెలిపారు. శనివారం పవర్‌ప్లాంటులో మహిళా కార్మికులతో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసి మహిళలపై లైంగిక వేధింపుల నిషేధిత నివారణ చట్టం–2013పై అవగాహన కల్పించారు. మహిళలకు ఎలాంటి సమస్యలు తలెత్తినా తమ దృష్టికి తీసుకు రావాలని అన్నారు. మహిళా వర్కర్లకు చట్టంపై పూర్తిగా వివరించారు. ఫిర్యాదు చేస్తే తక్షణమే తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎస్‌వోటీ జీఎం కొండా వెంకటయ్య పాల్గొన్నారు.

ఇదీ పోర్టల్

https:// womensafetywing. telangana. gov. in/ sahas

ధైర్యంగా ఫిర్యాదు చేయండి



ప్రభుత్వ కార్యాలయంలో గానీ ప్రైవేటు సంస్థల్లో పని చేసే చోట ఎవరైనా లైంగికంగా వేధింపులకు గురి చేస్తే లోకల్ కంప్లయింట్ కమిటీ(ఎల్‌సీసీ)ని సంప్రదించాలి. వివరాలను గోప్యంగా ఉంచుతాం. న్యాయం జరిగేలా చర్యలు చేపడుతాం. ఈ సేవలను ఉచితంగా అందిస్తాం. 2013సంవత్సరం నుంచి ఈ కమిటీ పని చేస్తుంది. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో కమిటీలు వేయడం జరిగింది. వేధింపులను తమలోనే దాచుకుని మానసికంగా కుంగిపోకుండా ధైర్యంగా ఉండాలి. ఎల్‌సీసీపై అవగాహన లేనిపక్షంలో మహిళా సాధికారత కేంద్ర మరియు సఖీ కేంద్రం, మహిళా శిశు సంక్షేమ శాఖను సంప్రదించవచ్చు. గత ఆరు నెలల క్రితం ఆదిలాబాద్‌లోని ట్రెజరీ కార్యాలయంలో ఓ కేసు నమోదు చేశాం.

– సరిత, లోకల్ కంప్లయింట్ కమిటీ చైర్‌పర్సన్, ఆదిలాబాద్

సమాచారం ఇవ్వండి



మహిళా ఉద్యోగులు, విద్యార్థులు, సాధారణ మహిళలు వేధింపులకు గురైతే వెంటనే షీ టీమ్ పోలీసులకు సమాచారం ఇవ్వండి. షీ టీమ్స్ భద్రత కల్పిస్తుంది. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో పనిచేసే మహిళలకు భద్రత కల్పించడమే లక్ష్యంగా పని చేస్తోంది. సమాచారం ఇచ్చిన వారిపేర్లు గోప్యంగా ఉంచుతాం. వేధింపులకు గురైన మహిళలు 100 డయల్, షీ టీమ్స్ వాట్సాప్ నంబర్ 6303923700కు ఫిర్యాదు చేయవచ్చు.

హైమ, షీ టీమ్ ఎస్సై, మంచిర్యాల

భరోసా కేంద్రాలు..



ప్రభుత్వం మహిళల భద్రత కోసం భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసింది. ప్రతీ ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో పని చేస్తున్న మహిళలందరూ కలిసి కమిటీలు ఏర్పాటు చేసుకోవాలి. మహిళలు కుటుంబాలు, ఇతర స్థలాల్లో తోటి ఉద్యోగులతో వేధింపులకు గురైతే భద్రత సెంటర్లు, న్యాయసేవాధికార సంస్థల్లో ఉచితంగా న్యాయసలహాలు తీసుకునే అవకాశం ఉంది. షీ టీమ్స్, భరోసా కేంద్రాల ద్వారా సమస్య పరిష్కరించుకునే అవకాశం ఉంది.

– సుంకరి శైలజ, న్యాయవాది, మంచిర్యాల

కాంగ్రెస్‌వి ఓటు బ్యాంకు రాజకీయాలు

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్



నిరసన వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యేలు

ఆదిలాబాద్: కాంగ్రెస్ పార్టీ ఓటు బ్యాంకు రాజకీయాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. హైదరాబాద్‌లోని నాంపల్లిలోని బీజేపీ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. హిందువులను కించపరిచే విధంగా అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీని అసెంబ్లీ ప్రోటెమ్ స్పీకర్‌గా నియమించడం సరికాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీ నియమావళి ఉల్లంఘించి సీనియర్లను కాదని అనుచిత వ్యాఖ్యలు చేసిన అక్బరుద్దీన్ ఓవైసీకి ప్రొటెం స్పీకర్‌గా విధులను అప్పగించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఆయన ప్రొటెం స్పీకర్‌గా వ్యవహరిస్తున్న నేపథ్యంలో బీజేపీ ఎమ్మెల్యేలు ఎవరు ప్రమాణ స్వీకారం చేయట్లేదని స్పష్టం చేశారు. అనంతరం అసెంబ్లీ ఎదుట నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ విషయమై గవర్నర్‌కు ఫిర్యాదు చేయడానికి వెళ్లగా గవర్నర్ అందుబాటులో లేకపోగా గవర్నర్ సెక్రటరీకి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి, ముధోల్ ఎమ్మెల్యే రామారావుపటేల్, సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు ఉన్నారు.

చేపల వేటకు వెళ్లి ఒకరి మృతి

భైంసాటౌన్: పట్టణ శివారులోని గడ్డెన్నవాగు ప్రాజెక్టులో చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు అందులో పడి ఒకరు మృతి చెందారు. పోలీసుల కథనం ప్రకారం.. సిద్ధార్థనగర్‌కు చెందిన సలాంఖాన్(48) శుక్రవారం సాయంత్రం గడ్డెన్నవాగు ప్రాజెక్టు వద్దకు చేపల వేట కోసం వెళ్లి తిరిగిరాలేదు. దీంతో శనివారం ఉదయం అతడి కుమారుడు అదిల్‌ఖాన్ వెళ్లి చూడగా ప్రాజెక్టు గేట్ల సమీపంలో మృతదేహం కనిపించింది. దీంతో పోలీసులకు సమాచారమందించాడు. ఎస్సై ఆమోస్ మృతదేహాన్ని బయటకు తీయించి ఏరియాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు.

ఆదివాసీలను ఇబ్బందులకు గురి చేయొద్దు



మాట్లాడుతున్న టీఏజీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్

- పోడు పట్టాలకు బ్యాంకులు రుణాలందించాలి
- టీఏజీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్

ఎదులాపురం: బ్యాంకు అధికారులు ఆదివాసీలను ఇబ్బందులకు గురి చేయకుండా పోడు పట్టాలకు బ్యాంకు రుణాలు ఇవ్వాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రం లోని సుందరయ్య భవనంలో శనివారం ఏర్పాటు చేసిన టీఏజీఎస్ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గత ప్రభుత్వం హడావుడిగా పట్టాల పంపిణీ ప్రారంభించి అనేక గ్రామాలల్లో సర్వే పూర్తి చేసినప్పటికీ పట్టాలు జారీ పూర్తి స్థాయిలో చేపట్టలేక పోయిందన్నారు. పట్టాలు పంపిణీ చేసిన వారికి బ్యాంకర్లు ఇబ్బందులకు గురి చేయకుండా రుణాలు అందించాలని డిమాండ్ చేశారు. ఫారెస్ట్ అనుమతులు లేక అనేక గ్రామాల్లో రోడ్డు పనులు, మౌలిక సదుపాయల కల్పన వంటి అభివృద్ధి కార్యక్రమాలు నిలిచిపోయాయని వాటిని వెంటనే పూర్తి చేయాలన్నారు. గిరిజనులకు విద్యా, వైద్యంపై నూతన ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించాలని కోరారు. వెనుకబడిన ఆదిలాబాద్ జిల్లాలో జనరల్ యూనివర్సిటీ ఉట్నూర్ కేంద్రంగా ఏర్పాటు చేసిన గిరిజనులకు ఉన్నత విద్యా సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని, నూతన ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను గిరిజన ప్రాంతాల్లో పూర్తిస్థాయిలో అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ఉయిక విష్ణు, ఉపాధ్యక్షుడు మడావి నాగోరావ్, కనక మల్కు, ఆత్రం కిష్టన్న, సహాయ కార్యదర్శి కోవ సునీల్, తుంరం ఈశ్వర్, మేస్రం మహేశ్ పాల్గొన్నారు.

ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభం



ప్రారంభిస్తున్న ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్

ఉట్నూర్‌రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని శనివారం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిని చాహత్ బాజ్‌పాయ్, ఉట్నూర్ ఆర్టీసీ డిపో పీవో గిల్లు, డీఎస్పీ నాగేందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐటీడీఏ పీవో మాట్లాడుతూ.. ప్రభుత్వం ద్వారా మహిళలకు ఆర్టీసీ ఆర్డీనరి, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించడం జరిగిందని, ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆర్టీసీ అధికారులు, సిబ్బంది ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా పూర్తి స్థాయిలో పథకం అమలయ్యేలా చూడాలని తెలిపారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో..

మహిళకు ఉచిత బస్సు ప్రయాణ కార్యక్రమం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఖయ్యుం ఆధ్వర్యంలో ఆర్టీసీ ఉట్నూర్ పట్టణ కేంద్రంలో నిర్వహించారు. ముందుగా ఆర్టీసీ బస్టాండ్‌లో ఆర్టీసీ అధికారులు, నాయకులతో కలిసి కేక్ కట్ చేసి మహిళలకు శుభాకాంక్షలు తెలుపుతూ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరు గ్యారెంటీలలో ముందుగా ఆర్టీసీ ఉచిత ప్రయాణ పథకం ప్రారంభించడం జరిగిందన్నారు. నాయకులు ఎక్బాల్, చంద్రయ్య, నిసార్, మహేందర్, సాజిద్ ఖురేషీ, మాజీద్, సులోచన పాల్గొన్నారు.

ఏజెన్సీ చట్టాలను నిర్వీర్యం చేస్తే ఉద్యమమే

- ఆదివాసీ సంఘాల జేఏసీ హెచ్చరిక



మాట్లాడుతున్న జేఏసీ నాయకులు

నార్నూర్: డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ కల్పించిన ఏజెన్సీ హక్కులను, చట్టాలను దళితదెబ్బ పేరుతో నిర్వీర్యం చేసే కుట్రలు చేస్తే మరో ఉద్యమానికి ఆదివాసీలు సిద్ధంగా ఉన్నారని ఆదివాసీ సంఘాల జేఏసీ నాయకులు పూసం ఈస్రు, దాదిరావు, పెందూర్ దీపక్, జాలీవషావ్ హెచ్చరించారు. శనివారం మండల కేంద్రంలోని కొమురం భీం భవన్ వద్ద జేఏసీ సమావేశం నిర్వహించారు. అనంతరం ఎస్సై రవికిరణ్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో అమలవుతున్న 1/70, పెసా చట్టాలతో పాటు భారత రాజ్యాంగం కల్పించిన ఐదు షెడ్యూల్ హక్కులను నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నం చేస్తున్నా గిరిజనేతరులపై తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన గ్రామాలపై సంపూర్ణ హక్కులు ఆదివాసీ గిరిజనులకే చెందుతాయన్నారు. ఆదివాసీ హక్కులను భంగం కలిగించేలా గిరిజనేతరులు నిర్వహిస్తున్న దళిత దెబ్బ కార్యక్రమాన్ని తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రామారావు, పెందూర్ సంతోష్, నాగోరావు, యెత్మారావు, శ్యాంరావు, మోహన్, ఆనందరావు, మానిక్‌రావు, మధుకర్, మానిక్‌రావు ఉన్నారు.

ఛాతినొప్పితో యువకుడి మృతి

- గతంలో భర్త.. ఇప్పుడు కొడుకు మృతి



విఘ్నేశ్వర్(ఫైల్)

ఇంద్రవెల్లి: ఛాతినొప్పితో యువకుడు మృతి చెందిన సంఘటన శనివారం మండలంలోని గట్టెపల్లిలో చోటుచేసుకుంది. గ్రామస్తుల వివరాల ప్రకారం.. గట్టెపల్లి గ్రామానికి చెందిన కోరెంగా భీంరావ్, లక్ష్మీబాయి దంపతులకు విఘ్నేశ్వర్(24) ఏకైక కుమారుడు. తండ్రి భీంరావ్ ఐదేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. విఘ్నేశ్వర్ తల్లికి చేదోడు వాదోడుగా ఉంటున్నాడు. అయితే ఏడాదిగా విఘ్నేశ్వర్ ఛాతినొప్పితో బాధపడుతున్నాడు. దీంతో తల్లి పలు ఆస్పత్రుల్లో చూపించినా నయం కాలేదు. పరిస్థితి విషమించడంతో ఇటీవల ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఓ ఆస్పత్రిలో చిక్సిత అందించి ఇంటికి తీసుకొచ్చారు. శనివారం తెల్లవారు జమూనా నొప్పి ఎక్కువ కావడంతో మళ్లీ ఉదయం ఆదిలాబాద్ రిమ్స్ ఆస్పత్రికి తరలించే క్రమంలో మృతి చెందాడు. భర్తను కోల్పోయిన లక్ష్మిబాయి చేతికొచ్చిన కొడుకు సైతం దూరం కావడంతో ఆ తల్లి రోదనలు మిన్నంటాయి.

పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య

ఆదిలాబాద్‌టౌన్: మహారాష్ట్రలోని కిన్వాట్ తాలుకా పటోడా గ్రామానికి చెందిన ఖజారే ధీరజ్ (22) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల వివరాల ప్రకారం... ధీరజ్ వ్యవసాయ భూమిని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. సాగుకు ప్రైవేట్‌గా రూ.2లక్షలు అప్పులు తీసుకున్నాడు. పంట ఆశాజనకంగా లేకపోవడం మనస్తాపానికి గురై శనివారం ఉదయం పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లుగా టూటౌన్ హెడ్ కానిస్టేబుల్ విజయ్ కుమార్ తెలిపారు.

ఉరేసుకుని మరో యువకుడు..

ఆదిలాబాద్‌టౌన్: తాగుడుకు బానిసై ఒకరు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పట్టణంలోని ఇందిరానగర్‌లో శనివారం చోటుచేసుకుంది. టూ టౌన్ ఏఎస్సై ముకుంద్‌రావు వివరాల ప్రకారం... పట్టణంలోని ఇందిరానగర్‌కు చెందిన కొండా అశోక్(34) కొంతకాలంగా తాగుడుకు బానిసయ్యాడు. దీంతో పెళ్లి సంబంధాలు రాకపోవడంతో మనస్తాపానికి గురయ్యాడు. ఉదయం తల్లి గంగమ్మను డబ్బులు అడగగా ఆమె నిరాకరించింది. ఆ సమయంలో తల్లి బట్టలు ఉతకడానికి వెళ్లగా ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే రిమ్స్‌కు తరలించగా అప్పటికే మృతి చెందాడు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లుగా ఏఎస్సై పేర్కొన్నారు.

ఇక్కడ గెలిచే పార్టీకే అధికారం



ఖానాపూర్ సభలో గత నెల 26న మాట్లాడుతున్న కేసీఆర్, పక్కనే జాన్సన్‌నాయక్



3న వెడ్మ బొజ్జు గెలుపు అనంతరం విజయోత్సవాల్లో పార్టీ శ్రేణులు

- మాజీ సీఎం కేసీఆర్ చెప్పిందే నిజమైంది..
- తెలంగాణ రాష్ట్రంలో కొనసాగుతున్న ఖానాపూర్ సెంటిమెంట్

ఖానాపూర్: ఖానాపూర్‌లో ఏ పార్టీ వ్యక్తి ఎమ్మెల్యేగా గెలిస్తే ఆ పార్టీ ప్రభుత్వమే రాష్ట్రంలో ఏర్పాటవుతుందని ఇటీవల జరిగిన ఖానాపూర్ ప్రజా ఆశీర్వాద సభలో మాజీ సీఎం కేసీఆర్ అన్నారు. ఆయన నోటి చలవో లేక గతం నుంచి వస్తున్న ఆనవాయితో.. మళ్లీ అదే సీన్ రిపీటైంది. గత నెల 26న ఖానాపూర్ పట్టణంలో బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి భూక్యా జాన్సన్‌నాయక్ ప్రచారసభకు హాజరై అప్పటి సీఎం కేసీఆర్ మాట్లాడారు. 2018 ఎన్నికల ప్రచారం సందర్భంగా సైతం ఇదే సభాస్థలంలో అప్పటి ఎమ్మెల్యే రేఖానాయక్‌కు మద్దతుగా ప్రచారం చేసి ఇదే వ్యాఖ్యల్ని ఆయన చేశారు. దీంతో రెండోసారి ఎమ్మెల్యేగా రేఖానాయక్ గెలిచి రెండోసారి బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడి కేసీఆర్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. కేసీఆర్ నోటిచలవతో ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఇక్కడ కాంగ్రెస్ అభ్యర్థి వెడ్మ బొజ్జు పటేల్ గెలుపొందడంతో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వమే రాష్ట్రంలోనూ ఏర్పాటైంది. దీనిపై పలువురు చర్చించుకుంటున్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి



అనంతబాయి(ఫైల్)

రెబ్బెన(ఆసిఫాబాద్): ఈ నెల 7న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన మండలం లోని నంబాల గ్రామానికి చెందిన రత్నం అనంత బాయి (48) చికిత్స పొందుతూ శనివారం తెల్లవారు జామున మృతి చెందినట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. నాలుగేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్న అనంతబాయికి పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించినా ఆరోగ్యం కుదుట పడకపోవడంతో మనస్థాపానికి గురైంది. ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో ఉండగా గమనించిన భర్త దేవాజీ కాగజ్‌నగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడి వైద్యులు మంచిర్యాలకు రెఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించి మృతి చెందింది. మృతురాలి సోదరుడు డోంగ్రి పవన్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.



తుఫాన్ ప్రభావంతో ఎక్కడ చూసినా మబ్బులు కమ్ముకున్నాయి. చల్లని వాతావరణానికి మనుషులు ఇబ్బందులు పడుతున్నారు. అయితే పక్షులు సైతం పైకి ఎగరకుండా చెరువులో దిగకుండా ఒడ్డుకు చేరి సేదతీరుతున్నాయి. నిర్మల్ జిల్లా కేంద్రంలోని సీతాసాగర్ చెరువు ఒడ్డుపై చల్లని వాతావరణానికి కొంగలు కోలాహలం చేస్తున్న దృశ్యాలను సాక్షి కెమెరా క్లిక్ మనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

